

## తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

ప్రజాశక్తి - భీమవరం

తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారు చేయాలని, దీనికి ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలని ఓటర్ల నమోదు పరిశీలనాధికారి, ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఎంవి.శేషగిరిబాబు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ ప్రశాంతితో కలిసి ఎలక్టోరల్ రోల్స్ స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు స్వీప్ యాక్టివిటీ ఎక్కువ చేయాలని సూచించారు. గరుడ యాప్ గురించి బిఎల్‌ఒలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఒకే ఓటరు రెండుసార్లు నమోదు కాకుండా జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో ఆయా నియోజకవర్గాల అధికారులతోపాటు కె.రవికుమార్ (బిజెపి), ఎం.శేఖర్ (కాంగ్రెస్), కావలి నాగేశ్వరరావు (వైసిపి), శ్యాంబాబు (టిడిపి), కె.భీమారావు (సిపిఐ), జెబిఎన్.గోపాలన్ (సిపిఎం) పాల్గొన్నారు.

# కార్యాచరణ ప్రణాళిక ఏది..?

**పనులకు కొబ్బరికాయ కొడితే పురోగతి సాధించినట్లా**

**ప్రజాప్రతినిధులు చెబితేగాని పనులు చేయరా**

**ఇరిగేషన్ అధికారులపై డిప్యూటీ సిఎం కొట్టు తీవ్ర అసంతృప్తి**

**ఆధునికీకరణ పనులకు 15 నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**ఏప్రిల్ 15 న కాలువలు మూసివేత..**

**జూన్ 1న మళ్లీ నీరు విడుదల**

**జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశ నిర్ణయం**

ప్రజాశక్తి - భీమవరం

'జిల్లాలో ఒఅండ్‌ఎం పనులు 84 మంజూరైతే కేవలం 15 మాత్రమే పూర్తి చేశారు. 31 పనులకు అసలు టెండర్లే వేయలేదు. 46 డ్రెయిన్ల ఆధునికీకరణ పనులు చేపడితే కేవలం మూడు పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన 34 పనులు ఏమయ్యాయని, అసలు మీ దగ్గర కార్యాచరణ ప్రణాళిక ఏది' అని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఇరిగేషన్ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులకు కొబ్బరికాయ కొడితే పురోగతి సాధించినట్లేనా.. ప్రజాప్రతినిధులు చెబితే తప్ప ఏ పనులూ చేయరా.. కాలువల్లో పూడికతీత, షట్టర్ల నిర్మాణం, షట్టర్ల మరమ్మతులు వంటి పాత, కొత్త పనులను తక్షణం గుర్తించి ఈ నెల 10వ తేదీలోపు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. కాలువలు, డ్రెయిన్ల ఆధునికీకరణ పనులు, మంచినీటి చెరువులకు తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలగకుండా ఏప్రిల్ 15న కాలువలు మూసివేసి తిరిగి జూన్ 1న నీరు విడుదల చేయాలని సమావేశం నిర్ణయించింది. ముఖ్యంగా జనవరి ఒకటో తేదీ నాటికి దాళ్వా వరినాట్లు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. జిల్లా జల వనరుల అధికారి పి.నాగార్జునరావు, ఏలూరు జిల్లా ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాసరావు తమ శాఖ ఆధ్వర్యాన జరిగిన అభివృద్ధి, ప్రతిపాదనలు, వివిధ సమస్యలు, అభివృద్ధి పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలుగులు మూసివేత, తెరవడానికి మధ్యలో 45 రోజులు సమయం ఉంటుందని, దీనికి ముందుగా టెండర్లు వేసి ఖరారు చేస్తే పనులు సక్రమంగా జరుగుతాయని అన్నారు. ప్రతియేటా పెండింగ్లో ఉన్న పనులనే ప్రతిపాదిస్తున్నారని, దీన్నిబట్టి పనులు ముందుకు సాగడం లేదని స్పష్టమవుతోందని అన్నారు. మే నెలలో జరిగే పనులకు డిసెంబర్‌లోనే టెండర్లు పిలిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కాలువలు, డ్రెయిన్ల మరమ్మతుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 2007లో జరిగిన ఆధునికీకరణ పనుల్లో నాణ్యత లేదని అప్పట్లో చెప్పినా నాటి ప్రభుత్వం వినలేదని, దీని ఫలితంగా 2018లో ఎర్రకాలువ 86 చోట్ల దెబ్బతిందని గుర్తు చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్ ఈ పనులపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేశారన్నారు. కెమికల్ స్ప్రేయింగ్ అనేది రైతుల నుంచి సమస్య వచ్చినప్పుడే కాకుండా అవసరమైన ప్రతిసారీ చేయాలన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

### అందుబాటులో 101.505 టిఎంసిల నీరు

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం 94.220 టిఎంసిల నీరు అవసరమని, అయితే 101.505 టిఎంసిల నీరు అందుబాటులో ఉందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. జిల్లాలోని 3,78,745 ఎకరాల ఆయకట్టుకు నూరుశాతం నీరు అందిస్తామన్నారు.

### రూ.5 లక్షల్లోపు పనులు రైతులు, సలహా మండలి కమిటీలకు అప్పగించాలి: కలెక్టర్

పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని నేపథ్యంలో రూ.5 లక్షల్లోపు విలువైన పనులను రైతులకు, వ్యవసాయ సలహా మండలి కమిటీలకు అప్పగించి వారి చేత చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ప్యాకేజీ టెండర్ల ప్రక్రియ మాదిరి కాకుండా విడివిడిగా చిన్న పనులకు టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయాలన్నారు. కొన్ని ప్రాంతాలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని, పనులకు అంచనాలు తయారు చేసి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. కాలువల్లో పూడిక, తూడు తీయడం వంటి పనులు కాలువలు మూసిన వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు, ఇఇలు, డిఇలు, ఎఇలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### కానరాని ఎంఎల్‌ఎలు

జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పంట చేలకు నీరు విడుదల చేయడంతోపాటు తాగునీటి అవసరాల నిమిత్తం నీటి లభ్యత వంటి వాటిపై ప్రధానంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంత ప్రాధాన్యత ఉన్న సలహా మండలి సమావేశానికి ఒక్క ఎంఎల్‌ఎ కూడా హాజరు కాలేదు. అధికార పక్షం ఎంఎల్‌ఎలు ఎలాగున్నా కనీసం ప్రతిపక్షంలో ఉన్న ఎంఎల్‌ఎలు సైతం సమావేశానికి హాజరు కాలేదు. అయితే సమావేశానికి హాజరైన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అధికారపక్ష ఎంఎల్‌ఎలు సమావేశానికి రాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంఎల్‌ఎలు కూడా సమావేశానికి వచ్చి ఉండుంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. అయితే ప్రాధాన్యత ఉన్న సాగునీటి సలహా మండలి సమావేశానికి ఏఒక్క ఎంఎల్‌ఎ హాజరు కాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

## విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కారానికి కృషి

### కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలను స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ భీమవరం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వస్తున్న విభిన్న ప్రతిభావంతుల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రభుత్వం కూడా వీరి అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలో చదువుకునే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతిభకు వైకల్యం అడ్డు కారాదన్నారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థయిర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభవంతుల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారి నీలకంఠప్రదాన్, డిఇఒ ఆర్.వెంకటరమణ, జిల్లా సర్వశిక్షాభియాన్ ఎపిసి పి.శ్యామ్‌సుందర్, విభిన్న ప్రతిభావంతులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### విభిన్నప్రతిభావంతుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి సీనియర్ సివిల్ జడ్జి అప్పలస్వామి

**ఉండి:**విభిన్న ప్రతిభావంతుల పట్ల జాలి చూపడం ముఖ్యం కాదని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని భీమవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. శనివారం స్థానిక భవిత కేంద్రంలో ఎంఇఒ ఎ.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ సమాజంలో సమన్యాయం కోసం ఉచితంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తునట్లు తెలిపారు. కలిసి ఉంటే కలదు సుఖం అని తెలియజేస్తామన్నారు. పెద్దలకు ఉన్నట్లే పిల్లలకు కూడా కొన్ని హక్కులు ఉన్నాయని చెప్పారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు మాట్లాడుతూ ప్రతియేటా విద్యార్థులకు క్రీడలు నిర్వహించి లయన్స్‌క్లబ్ తరపున బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఎంఇఒ రవీంద్ర మాట్లాడుతూ పట్టుదల ఉంటే దేనినైనా సాధించొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు, న్యాయవాదులు పి.అంబేద్కర్, ఎన్.రమేష్, బి.లోకేశ్వరరావు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు ఎ.శేషయ్య, భవిత ఉపాధ్యాయులు చంద్రకళ, తబిత మాట్లాడారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు కాగిత మహంకాళి, ముదునూరి శివరామరాజు, పెన్మెత్స రంగప్రసాద్ రాజు, ఫ్లారెన్స్, శశికళ, చక్రవర్తి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులచే సీనియర్ సివిల్ జడ్జి కేక్ కట్ చేయించారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.


ఉప్పుటేరులో పడవలపై ప్రచారం

## పడవలపై వ్యకాస రాష్ట్ర మహాసభ ప్రచారం

ప్రజాశక్తి - కాళ్ల

జంగారెడ్డిగూడెంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగబోయే వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, పూర్వపు కార్యదర్శి గొర్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. మండలంలోని ప్రాతళ్లమెరక, పల్లిపాలెం గ్రామాల్లో ఉప్పుటేరులో వినూత్నంగా 29 జెండాలతో పడవలపైన సంఘ నేతలు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలో భూమి, కూలి, ఉపాధి, ఇళ్ల స్థలాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆక్వా కాలుష్యంపై ప్రధానంగా చర్చ సాగుతుందన్నారు. మహాసభల ప్రారంభ సూచికంగా ఎనిమిదో తేదీన జంగారెడ్డిగూడెం బస్టాండ్ సెంటర్లో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభకు జాతీయ నాయకులు బృందాకరత్, అఖిలభారత అధ్యక్ష కార్యదర్శులు ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్, కేరళ మంత్రులు హాజరవుతున్నారని తెలిపారు. అఖిలభారతం మహాసభ 2023 ఫిబ్రవరి 15 నుండి 19 వరకు బెంగాల్లో జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బల్ల చిన వీరభద్రరావు, జక్కం శెట్టి వెంకటలక్ష్మి, దాసి లాజర్ మాట్లాడగా నేతలు నరాలశెట్టి రామకృష్ణ, షేక్ పాదుషా, తిరుమాని శ్రీనివాసు, చాట్ల యేసురత్నం, సిరివెళ్ల రవికుమార్, తిరుమాని రామలక్ష్మి, బోడిగడ్డ యెహెూషువా, దాసి బాలయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధానాల వల్లే నత్తనడకన ఇళ్ల నిర్మాణం

### సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వాల విధానాల వల్లే ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. శనివారం సిపిఎం పట్టణ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం వందెకరాలు కేటాయించిన ప్రభుత్వం కేవలం 12 ఎకరాలను మాత్రమే పూడ్చిందన్నారు. దీనిలో కూడా మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైందని విమర్శించారు. కేవలం సెంటు స్థలం కేటాయించి అందులో చుట్టూ అడుగు స్థలం వదలాలని, ప్రభుత్వం చెప్పిన డిజైన్‌లోనే ఇళ్ల నిర్మాణం జరగాలనే షరతుల వల్లే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలో సెప్టిక్ ట్యాంక్, మెట్ల ల్యాండ్‌కూ సరిపోవడం లేదని, కనీసం సెంటున్నర స్థలం పెంచాలని డిమాండ్ చేశారు. నర్సాపురంలో ప్రభుత్వం కేటాయించిన వందెకరాల్లో 30 ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభం కాలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ వ్యయం పెరిగిన దానికి తగినట్టుగా ప్రభుత్వ సహకారం అందించాలని, కనీసంగా రూ.5 లక్షలు ఇవ్వకపోతే నిర్మాణం ఎలా చేయగలరని ప్రశ్నించారు. రోడ్ల సదుపాయం కల్పించాలని కోరారు. పట్టణాన్ని వదిలి మౌలిక సదుపాయాలు లేని మూలప్రాంతానికి వెళ్లాల్సి రావడం వల్లే నిర్మాణాలు సాగడం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో నేతలు బొక్కా శ్రీనివాస్, పొన్నాడ రాము, పొగాకు నారాయణరావు, మంచిలి నీలకంఠం, బూడిద జోగేశ్వరరావు, కవురు శ్రీనివాస్ గుత్తుల శ్రీరామచంద్రుడు, కొండాలమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న రాయప్రోలు భగవాన్

## నాటిక పోటీలు ఘనంగా ప్రారంభం


**వీరవాసరం:**తోలేరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యాన 18వ జాతీయస్థాయి నాటిక పోటీలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. యిర్రింకి సూర్యారావు కళాప్రాంగణంలో ప్రారంభమైన ఈ పోటీల ప్రారంభ సభ కళాపరిషత్ అధ్యక్షుడు చవ్వాకుల సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నేటి సమాజంలో మంచీ చెడులను ఇతివృత్తాలను కథలుగా తయారు చేసుకుని నాటికల ప్రదర్శన ద్వారా ప్రజలకు తెలియజేయడంలో కళాపరిషత్‌లు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. నేడు నాటక రంగం ఇంకా సజీవంగా ఉందంటే ఇటువంటి కళాపరిషత్‌లు వల్లేనన్నారు. ఖర్చుకు వెనుకాడకుండా అంతంకంతకు తోలేరు కళాపరిషత్ నాటిక ప్రదర్శనలు మరింత శోభ తెస్తుందనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఒక మారుమూల గ్రామంలో ఇటువంటి కళాపరిషత్‌ను నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళాకారులు, వివిధ రంగాలకు చెందిన కళాకారులు నాయుడు గోపీ, సిహెచ్‌వివి.సత్యనారాయణమూర్తి, పెడగాని మోహన్‌కృష్ణ, సుభాషిణిలను కళాపరిషత్ తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి సత్యనారాయణ, యిర్రింకి సూర్యారావు, లింగం సత్యనారాయణ, రాయప్రోలు భగవాన్, మానాపురం సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శించిన అస్తికలు నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# జోరు.. బేజారు..!

**చంద్రబాబు పర్యటనతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం**

**చింతలపూడి, పోలవరంల్లో గ్రూపు తగాదాలపై వీడని ఆందోళన**

**నూతన విధానం పేరిట వరి రైతులతో ప్రభుత్వ చెలగాటం**




టిడిపి అధినేత చంద్రబాబు పర్యటన జిల్లాలోని ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. దెందులూరు, చింతలపూడి, పోలవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల మీదుగా సాగిన పర్యటనలో ఆయా ప్రాంతాల్లో ప్రధాన సమస్యలు ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతూ చంద్రబాబు ప్రసంగాలు సాగడం ఆయా ప్రాంత టిడిపి కార్యకర్తలను, నేతలను ఉత్తేజపరిచింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం, పోలవరం ప్రాజెక్టు, ధాన్యం రైతుల సమస్యలు తన ప్రసంగంలో ప్రస్తావించారు. అయితే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై విమర్శలు గుప్పించిన చంద్రబాబు తన ప్రభుత్వం హయాంలో చింతలపూడి, పోలవరం నిర్వాసితుల ఊసే మరిచిన విషయాన్ని రాజకీయ పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. గతమెలాగున్నా రానున్నకాలంలో అధికారంలోకొస్తే నిర్వాసితులను ఎలా ఆదుకుంటారనేది స్పష్టంగా చెప్పకపోవడంపై బాధిత ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు అంశంగా 70 శాతానికిపైగా పనులు తామే పూర్తి చేశామని చెబుతున్న చంద్రబాబు నిర్వాసితులకు పునరావాసం, పరిహారంపై పెద్దగా నోరు మెదపకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. తన చేతుల మీదుగానే పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తానని పదేపదే చెబుతున్న చంద్రబాబు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం, పరిహారం అందిస్తామని ఎక్కడా స్పష్టం చేయకపోవడం చర్చనీయాంశమైంది. అంటే గతంలో వలె ప్రాజెక్టు పూర్తిపైనే దృష్టి సారించడం తప్ప నిర్వాసితులను గతంలో వలె, ఈ ప్రభుత్వం తరహాలో గాలికొదిలేస్తారని అర్థమవుతోందని నిర్వాసితుల నేతలు చెబుతున్నారు. ఇక చింతలపూడి భూనిర్వాసితులు పట్టిసీమ తరహా పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. దానిపై నాడు.. నేడు కూడా ప్రస్తావన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదే సమయంలో దెందులూరు నియోజకవర్గం మినహా మిగిలిన చోట్ల ఆ ప్రాంత నేతలకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడమూ చర్చనీయాంశమైంది. పెదవేగి మండలం విజయరాయిలో దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌కు అవకాశం ఇచ్చారు. అయితే చింతలపూడిలో మాజీ మంత్రి పీతల సుజాతకుగాని, పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెంలో మాజీ ఎంఎల్‌ఎ మొడియం శ్రీనివాస్, గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన బొరగం శ్రీనుకుగాని మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఈ రెండుచోట్ల మాజీ ఎంపీ మాగంటి బాబుకే మాట్లాడే అవకాశం ఇచ్చారు. ప్రధానంగా ఈ రెండు నియోజకవర్గాల్లో పార్టీలోని గ్రూపుల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు వల్లే స్థానిక నేతలకు అవకాశం కల్పించలేదనే ప్రచారం జోరుగా సాగుతోంది. తాత్కాలికంగా ఇరు గ్రూపులకు అవకాశం కల్పించకుండా చంద్రబాబు పర్యటన సాగించినా రానున్న రోజుల్లో ఆ గ్రూపు విబేధాలు సమసిపోయేలా చర్యలు తీసుకోకపోతే పార్టీకి నష్టమేనని ఆ పార్టీ శ్రేణులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇక చంద్రబాబు ఏలూరు జిల్లా పర్యటన అంతా చింతమనేని ప్రభాకర్ తానై నడిపించారు. గతంలోనూ గోదావరి వరదల సందర్భంగా విలీన మండలాల్లో పార్టీ తరపున సాయమందించే కార్యక్రమాల్లో ఆ నియోజకవర్గ నేతలతో సంబంధం లేకుండానే నేరుగా పాల్గొన్నారు. మొత్తంగా పరిణామాలన్నీ చూస్తే రానున్న ఎన్నికల్లో చింతమనేని ఏలూరు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశాలు కన్పిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

**సమస్యల సుడిలో ధాన్యం రైతు**

వరిసాగు ఆరంభం నుంచి పంట చేతికొచ్చే వరకూ ప్రభుత్వ విధానాలు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు అల్లాడేవారు. పంట చేతికొచ్చాక ధర సమస్య తప్ప అమ్మకం, సొమ్ము చేతికందడం వంటి సమస్యలు పెద్దగా ఉండేవి కావు. ప్రభుత్వాల విధానాల ఫలితంగా సాగు ఆరంభం నుంచి ధాన్యం విక్రయించి సొమ్ము చేతికొచ్చే వరకూ అడుగడుగునా రైతులను సమస్యలు వెంటాడుతున్నాయి. చేతికొచ్చిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. గోనె సంచుల కొరత, తేమ శాతం నిబంధనలు ఇప్పటికే రైతులను వేధిస్తుండగా తాజాగా లారీల సమస్య తీవ్ర రూపం దాల్చడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. సొమ్ము మాటెలాగున్నా ధాన్యం మిల్లుకు ఎప్పుడు చేరుతుందా అని రైతులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా పాలకులు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఇప్పటికే వరిసాగుకు దూరమవుతున్న రైతులు ప్రస్తుత పరిస్థితులతో మరింత బేజారెత్తి సాగుకు పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

-వియస్‌ఎస్‌వి.ప్రసాద్

# ఆ భూములు పేదలకు ఇవ్వొచ్చుగా..!

**భూస్వాముల కబంధ హస్తాల్లో ఎర్రకాల్వ మిగులు భూములు**

**ఏజెన్సీలో ఎల్‌టిఆర్, పోడు భూముల పరిస్థితీ అంతే**

**పేదలు రోడ్డెక్కినా పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు**

**ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన నిరంతర పోరు**

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్


మాకు సెంటు భూమి లేదు.. ప్రభుత్వ భూమి లేదా మిగులు భూమి ఇస్తే సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటాం అని పేదలు ఏ ప్రజాప్రతినిధినైనా, అధికారినైనా కోరితే భూములు ఎక్కడున్నాయనే ప్రశ్న టక్కున అర్జీదారులపై సంధిస్తారు. అయితే బడాబాబులు, భూస్వాముల కబంధ హస్తాల్లో ఉన్న భూముల జోలికి మాత్రం వెళ్లరు. ఒకవేళ ఎక్కడైనా ప్రభుత్వ భూమి నిరుపయోగంగా ఉంటే అక్కడ సాగు చేసుకునేందుకు పేదలు ఉపక్రమిస్తే ఆగమేఘాల మీద అధికారులు పోలీసులను వెంటబెట్టుకుని వాలిపోతారు. పేదలు అనే కనికరం లేకుండా విరుచుకుపడి వారిని అక్కడి నుంచి తరిమికొడతారు. ఇదేమిటని ప్రశ్నిస్తే లాఠీదెబ్బలు, అరెస్టులు, కేసులు షరామాములే. ఇదీ జిల్లాలో భూమిలేని సగటు పేదవాని దుస్థితి

అయితే ప్రభుత్వ, మిగులు భూములు ఎక్కడున్నాయో గుర్తించి వాటిని పేదలకు పంచాలని జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం నిర్విరామ పోరు సాగిస్తోంది. దీనిలో భాగంగా జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం ప్రాంతాల్లోని ఎర్రకాల్వ మిగులు భూములను పేదలకు పంచాలని అప్రతిహతంగా సంఘం ఆధ్వర్యాన ఆయా ప్రాంతాల పేదలు పోరాడుతున్నారు. ఏజెన్సీలో ఎల్‌టిఆర్, పోడు భూములను గిరిజనులకు పంచాలని అక్కడి గిరిజన సంఘంతో కలిసి పేద యువత, మహిళలను సమీకరించి పోరుబాటలో ముందుకు సాగుతున్నారు. ఎర్రకాల్వ రిజర్వాయర్ మిగులు భూములు పేదలకు సాగుకివ్వాలని, జిల్లాలో 16 రకాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, సాగులో ఉన్న భూములు, గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని, ఏజెన్సీలో ఎల్‌టిఆర్ భూములు గిరిజనులకు పంచాలని, పోడు, అటవీ బంజరు భూములకు పట్టాలివ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లో 1980లో నిర్మించిన ఎర్రకాల్వ రిజర్వాయర్ కోసం ఏడు వేల ఎకరాలు సేకరించారు. నాటి నుండి సుమారు 2500 ఎకరాలు ముంపులో లేకుండా మిగులు భూములుగా ఉన్నాయి. దీంతో ఆ భూములను అమ్మిన భూస్వాములు, సంపన్నులే నాటి నుండి అక్రమంగా, చట్టవిరుద్ధంగా వాటిని అనుభవిస్తున్నారు. భూములకు పరిహారం పొంది, వాటితో మరోచోట భూములు కొని అనుభవిస్తున్నారు. ఈ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా పామాయిల్, జామాయిల్, కొబ్బరి, చెరకు, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తున్నారు. దీనివల్ల గట్టు బలహీనపడుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పైగా వీరికి విద్యుత్ శాఖ బోరు కనెక్షన్లు సైతం ఇచ్చింది. 40 ఏళ్ల కాలంలో ప్రభుత్వాలు, నేతలు మారినా యథేచ్ఛగా పైసా శిస్తు చెల్లించకుండా ఆ భూములను పెద్దలు అనుభవిస్తూనే ఉన్నారు. ఈ భూములన్నీ పేదలకు సాగుకు ఇవ్వాలని భూముల్లోకి ప్రవేశించినప్పుడు మాత్రమే ప్రభుత్వాలకు, అధికారులకు చట్టాలు, నిబంధనలు గుర్తొస్తాయి. గత నాలుగు సంవత్సరాల నుంచి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన సాగిస్తున్న పోరాటం పేదల్లో ఆశలు చిగురింపజేసింది. కులం, మతం, ప్రాంతం, పార్టీ విభేదాలన్నింటినీ పక్కనబెట్టి పేదలంతా ఒక్కటయ్యారు. పట్టుదలగా పోరాటం సాగిస్తున్నారు. వందలాది ఎకరాల్లో వరి సాగు వేసి ధాన్యం పంచుకుంటున్నారు. పామాయిల్, కొబ్బరి తోటల్లో ఫలసాయం పొందుతున్నారు. దీన్ని సహించలేని భూస్వాములు, సంపన్నులు నాటి, ప్రస్తుత అధికార పార్టీల నేతలు కుమ్మక్కై అధికారుల సహకారంతో నిర్బంధానికి పాల్పడుతున్నారు. పదికి పైగా కేసులు మోపారు. పేదలపై తుపాకులు ఎక్కుపెట్టి బెదిరించారు. గూండాలతో దాడులకు పూనుకున్నారు. పేదలకు అండగా నిల్చిన టి.నర్సాపురం మండల నాయకుడు తుమ్మల సత్యనారాయణను కిడ్నాప్ చేసి, చంపేస్తామని బెదిరించడం భూస్వాముల ఆగడాలకు పరాకాష్టగా చెప్పొచ్చు. వీటన్నింటినీ తిప్పికొట్టి పేదలు ఐక్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఇరిగేషన్ రాష్ట్ర స్థాయి అధికారులపై ఒత్తిడి చేసి భూస్వాములే భూములు సాగు చేసుకునేలా, శిస్తు కట్టించుకునేలా అనుమతులు తీసుకురావడం గమనార్హం. అయినప్పటికీ పేదలు పట్టు వీడకుండా పోరాడుతున్నారు. మరోపక్క కోర్టుల్లోనూ న్యాయపోరాటం సాగిస్తున్నారు.




**జిల్లాలో అన్ని భూముల సంగతీ అంతే**

జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో 80 ఎకరాల సీలింగ్ భూములు, టి.నర్సాపురం మండలం రామన్నగూడేనికి చెందిన 40 ఎకరాలు, కృష్ణాపురం మెట్టపై అల్లూరి సీతారామరాజునగర్‌లో గుడిసెలు వేసుకున్న 80 ఎకరాల దేవుని మాన్యం భూముల విషయంలో జరుగుతున్నది ఇదే. అల్లంచర్లరాజుగూడెంలో 300 ఎకరాల అసైన్డ్ భూముల విషయమై ప్రభుత్వాలు మారినప్పుడల్లా స్థానిక పెత్తందారులు కొత్త వివాదాలు తీసుకొస్తున్నారు. లింగపాలెం మండలం భోగోలులో 1400 ఎకరాలు అసైన్డ్ భూములు దశాబ్దాలు గడిచినా పేదలకు దక్కడం లేదు. చింతలపూడి పాత తాలుకాలో 30 వేల ఎకరాల అసైన్డ్ భూములు సంపన్నుల ఆక్రమణలోనే ఉన్నాయి. జిల్లాలో 16 రకాల ప్రభుత్వ భూములు 5.75 లక్షల ఎకరాల్లో నాలుగు లక్షల ఎకరాలకుపైగా సంపన్నుల గుప్పెట్లో ఉన్నాయి. తాడేపల్లిగూడెం మండలంలో జిల్లా పరిషత్ భూములు, దెందులూరు మండలం కొవ్వలి, దోసపాడు, పోతునూరు గ్రామాల్లో అసైన్డ్ భూములు వందల ఎకరాలు భూమాఫియా చేతుల్లో ఉన్నాయి. ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక ఒకే ఇంట్లో మూడు, నాలుగు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది.



**భూములు పంచాలని పోరు ఉధృతం**

**ఎం.జీవరత్నం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు**

భూముల సమస్యపై ఎపి వ్యవసాయ కార్మిక సంఘం భూశంఖారావం పేరిట చేపట్టిన పాదయాత్ర పేదల్లో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపింది. అధికారులు సైతం ఒకింత అప్రమత్తమయ్యారు. అయితే అధికార పార్టీ పెద్దలు, పెత్తందారుల ఒత్తిడిలో వారు కూడా బడాబాబుల పక్షానే నిలుస్తుండటం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ, మిగులు భూములను పేదలకు పంచితే కొన్ని వేల కుటుంబాల జీవనం మెరుగుపడుతుంది. పేదలకు భూములు పంచాలని పోరు రానున్న కాలంలో మరింత ఉధృతం చేస్తాం.

## హౌసింగ్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

హౌసింగ్ విషయంలో కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపిడిఒ పూర్ణ బాబ్జి అన్నారు. హౌసింగ్‌పై మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులతో శనివారం రివ్యూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ బాబ్జి మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణ విషయంలో పూర్తి బాధ్యత కార్యదర్శులు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ఎఇ మల్లేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో 3282 మంది లబ్ధిదారుల్లో 1500 బిబిఎల్ నుంచి బిఎస్ స్థాయికి చేరారన్నారు. ఇంకా 1592 మంది ప్రారంభించుకోవాలని చెప్పారు. అనంతరం మాముడూరులో లే అవుట్‌లో 66 మంది ఆప్షన్ 3 చెందినవారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

## గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - ఉండి

గర్భిణిలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి.సాయిచంద్ర అన్నారు. మండలంలోని పెదపుల్లేరు హెల్త్ సెంటర్‌లో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.సాయిచంద్ర మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే వైద్య పరీక్షలు, మందులు ఈ శిబిరంలో అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో 104 డాక్టర్ నరసరాజు, సిహెచ్ఒ కృష్ణకుమార్, ఎఎన్ఎం ఎం.దయావతి, ఎంఎల్‌హెచ్‌పి ఆర్ రవివర్మ, హెల్త్ అసిస్టెంట్ జి.వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు శిరీష, మరియమ్మ, సరోజినీ పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్ :** హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటరు అగ్రాహంలో ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం కార్యక్రమం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టరు అడ్డాల ప్రతాప్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ వి.ప్రసాద్, ఎంపిహెచ్ఇఒ రమేష్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులను పరీక్షించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి బి.రాజశ్రీ, 104 వాహనం వైద్యులు డాక్టర్ పివి.నారాయణ, విస్తరణ అధికారి కె.ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్లు వైఎన్.మూర్తి, ఎస్.అమలేశ్వరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెరటి కోళ్ల పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెరటి కోళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి పొందాలని సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు అన్నారు. లబ్ధిదారులకు శనివారం పెరటి కోళ్లను అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఒక్కో యూనిట్‌కి 15 కోళ్ల చొప్పున ఆచంట పంచాయతీకి 25 యూనిట్లు మంజూరయ్యాయని, వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు రామానుజం, వెంకట్రావు పాల్గొన్నారు.

## నందమూరుగరువులో నేత్రదానం

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో నందమూరుగరువులో విశ్రాంత ఉపాధ్యాయులు సవరం సుబ్బారావు(82) మరణించడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం ఇచ్చారు. సుబ్బారావు శనివారం మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ ఐ డొనేషన్ సెంటర్‌కు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ కమలకుమారి వచ్చి మృతుడి కళ్ల నుంచి కార్నియాలను సేకరించారు. వీటిని హైదరాబాదులోని రామాయమ్మ ఇంటర్‌నేషనల్ ఐ బ్యాంకుకు పంపనున్నట్లు తెలిపారు. సుబ్బారావు మృతి చెందిన వెంటనే నేత్రదాన ప్రోత్సాహక సంఘం అధ్యక్షులు పెన్మెత్స సుబ్బారాజుకు సమాచారం ఇవ్వడంతో మృతుడి కుమారుడు వసంతాల భుజంగరావు, బుద్ధరాజు భారతి సమక్షంలో నేత్రాల సేకరణ ప్రక్రియ పూర్తి చేశారు.

## హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక సుబ్బారావు పేట మున్సిపల్ హైస్కూల్‌లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.ఎస్తేరురాణి ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరురాణి మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా అందరూ సహకరించాలని కోరారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. సోషల్ మీడియా వైపు ఎక్కువ మొగ్గు చూపకుండా, మంచి మార్గంలో నడవాలని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకండా ధైర్యంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ ఆలయం వద్ద కోనేరు, ప్రసాద వితరణ శాల నిర్మాణాలతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొట్టు రామాంజనేయులు (అంజి), ఉపాధ్యక్షులు వట్టిపోలు రాము, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గుండు బోగుల వెంకటరమణ, వైసిపి పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు, పెదప్రోలు భాస్కర్, వెలనాటి సత్తిబాబు, నున్న రంగనాధ్, నున్న సుందరం, ఇఒ చీమలకొండ సాయి పాల్గొన్నారు.

## ఓటు హక్కు తప్పనిసరి

ప్రజాశక్తి - మొగల్తూరు

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని విఆర్ఒ కావ్య సూచించారు. పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రంలో శనివారం ఓటు నమోదు దరఖాస్తు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక క్యాంపులో భాగంగా ఈ నెల 3, 4 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటు నమోదు చేసుకునేందుకు, జాబితా పేర్లు ముద్రణ తప్పు, డోర్ నెంబర్లు మార్చుకునేందుకు ఆయా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

మొగల్తూరులో పోలింగ్ కేంద్రాన్ని తహాశీల్దార్ జి.అనితకుమారి శనివారం సందర్శించారు. మండలంలోని 59 పోలింగ్ కేంద్రాల్లో 159 మంది ఓటు నమోదుకు దరఖాస్తు అందించారని ఆమె తెలిపారు. ఓటు తొలగించుకునేందుకు ఐదు దరఖాస్తులు వచ్చాయని చెప్పారు.

## పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో మౌలిక వసతులను కల్పించడానికి సహకరిస్తామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పివిఎల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులను ఉపయోగించి బిసి కాలనీలో డ్రెయినేజీలు నిర్మించినట్లు తెలిపారు. వాలంటీర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని పెంచేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఇటీవల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న సచివాలయ సిబ్బందికి జీతాలు పెరగడంతో పివిఎల్ నరసింహరాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఉప సర్పంచి కడలి సత్యనారాయణ, ఎంపిటిసి మున్నలూరి సువర్ణలక్ష్మి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్ :** మండలంలోని వడ్లవానిపాలెంలో శనివారం నిర్వహించిన గడగపడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పద్మ, నాగబాబు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, ఏడుకొండలు, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులునాయుడు, మండల కన్వీనర్ మైకేల్ రాజు, వైస్ ఎంపిపి సునీల్, గ్రామ సర్పంచి పెద్దిరాజు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

### ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని లంకలకొడేరు హై స్కూల్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వీరవాసరం గ్రామానికి చెందిన కొల్ల లక్ష్మీకొండాలమ్మ (45) పుట్టినిల్లు పాలకొల్లుకు ఆమె కుమారుడితో కలిసి బైక్‌పై శనివారం బయలుదేరింది. ఈ క్రమంలో మార్గమధ్యలో లంకలకోడేరు వద్దకు వచ్చేసరికి ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కొండలమ్మను స్థానికులు పాలకొల్లు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు.



## ఆదర్శప్రాయులు పిర్ల స్వామి


పిర్ల స్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఒకపక్క రిక్షా కార్మికుడిగా పని చేసుకుంటూనే మరో పక్క సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తూ అనేక ఉద్యమాల్లో పాలు పంచుకున్న గణేశుల పిర్ల స్వామిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. మండలం పరిధిలోని శృంగవృక్షంలో పిర్లస్వామి స్వగృహం వద్ద ఆయన సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు కామిశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన గోపాలన్ మాట్లాడారు. రిక్షా కార్మికుడిగా జీవనం సాగిస్తూనే సాటి వారు పడుతున్న సమస్యల పరిష్కారానికి పిర్ల స్వామి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పిర్ల స్వామి భాగస్వాములు అయ్యారని చెప్పారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ పిర్ల స్వామి వంటి ఒక మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి, పార్టీకి తీరని లోటని చెప్పారు. 1995-1996 మధ్యకాలంలో శృంగవృక్షంలో జరిగిన కూలీ రేట్ల ఉద్యమంలో పిర్ల స్వామి ప్రముఖ పాత్ర పోషించారని గుర్తుచేశారు. సిపిఎం సీనియర్ నాయకులు పల్లెం భీమన్న, కొటికలపూడి శ్రీను మాట్లాడుతూ గ్రామంలో చేసిన పోరాటాల్లో పిర్ల స్వామి చేదోడు వాదోడుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. రానున్న కాలంలో పిర్ల స్వామిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సభలో సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, వి.నారాయణమూర్తి, కె.సత్యనారాయణ, సిహెచ్.సూర్యచంద్రరావు, మైదాపుల రాంబాబు, అడ్వకేట్ గూడూరి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చల్లావారివీధిలో తాగునీరు అందించాలని ఆందోళన

ప్రజాశక్తి - పెంటపాడు


ఆందోళన చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

మండలంలోని పెంటపాడు ఐదో వార్డు చల్లావారివీధిలో సుమారు 50 కుటుంబాలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సిపిఎం, సిఐటియు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం చల్లావారివీధిలో స్థానికులు, సిపిఎం, సిఐటియు నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ మంచినీరు, డ్రెయినేజీ నీరు కలిసిపోవడంతో పైపుల నుంచి వచ్చే నీరు తాగేందుకు పనిచేయడంలేదని వాపోయారు. దీనిపై పంచాయతీకి విన్నవించినా అధికారులు స్పందించడంలేదన్నారు. ఒకపక్క మోటార్లకు కరెంట్ బిల్లు కట్టలేకపోతున్నామని, బయట వారు కూడా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కలుషిత నీరు తాగితే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, ఇప్పటికే ఈ రోగాలతో ఆసుపత్రిలో రూ.వేలు ఖర్చు పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పైపులైన్ మెరుగుపడే వరకు ట్యాంకర్ ద్వారా కాని ఇతర మార్గాల్లో గాని మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ అధికారులు స్పందించి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం, సిఐటియు నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పుల్లారెడ్డి, సిఐటియు నాయకులు రంగారావు, పెనగంటి దుర్గ, కొయ్యన పద్మావతి, లక్ష్మి, జయమ్మ, మల్లేశ్వరి, దేవి, ధర్మరెడ్డి, అనసూయ, నాగమ్మ, నుకమ్మ, సరోజిని, అప్పయ్యమ్మ, సూరమ్మ, ముత్యాలమ్మ, నాగలక్ష్మి, దారపు రెడ్డి పాల్గొన్నారు.

## బిసి కమ్యూనిటీ హాలు పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకోడేరు


ఎంఎల్ఎ రామరాజును సత్కరిస్తున్న వక్తలు

పెన్నాడ గ్రామంలో బిసి కమ్యూనిటీ హాలు పునః నిర్మాణ పనులకు ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామారాజుతో పాటు పాలకోడేరు ఎంపిపి భూపతిరాజు నారాయణ రాజు (చంటి రాజును) చిల్లా అనుష సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామరాజు మాట్లాడుతూ బిసి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి గ్రామస్తులు, పెద్దల సహకారంతో నిధులు వెచ్చించడం అభినందనీయమన్నారు. కమ్యూనిటీ హాలు ఆధునికీకరణకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చేబోలు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు డిటి కోటేశ్వరరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు బైరెడ్డి నరసింహరావు, పార్టీ నాయకులు దొమ్మటి వేణు, జక్కంశెట్టి మురళి, పెంటయ్య, శ్రీదేవి, ఇళ్ల చినసత్యనారాయణ (పండు), ఆరేపల్లి నాగరాజు పాల్గొన్నారు.

## 7న జయహో బిసి మహాసభ

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల ఏడో తేదీన నిర్వహించే జయహో బిసి మహాసభను విజయవంతం చేయాలని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బిసి సామాజిక వర్గానికి అండగా ఉంటున్నారన్నారు. ఈ నెల ఏడో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం విజయవాడలో నిర్వహించే జయహో బిసి మహాసభకు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు, కోరాడ శ్రీనివాస్, చినిమిల్లి గణపతి, చినబాబు పాల్గొన్నారు.

**భీమవరం రూరల్ :** ఈ నెల ఏడో తేదీన విజయవాడలో నిర్వహించే వైసిపి జయహో బిసి మహాసభను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్ల పాలనలో బిసి వర్గాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా 139 బిసి కులాలకు సంబంధించి 56 ప్రత్యేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి తద్వారా వారి అభివృద్ధికి బాట వేశారన్నారు. బిసి వర్గాలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. అనంతరం జయహో బిసి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, గూడూరి ఉమాబాల, మేడిది జాన్సన్, భీమవరం మండల వైస్ ఎంపిపి తిరుమాని గంగాభవాని, సర్పంచులు నాగిడి నారాయణస్వామి, కోళ్ల బాలకృష్ణ, జల్లా కొండయ్య, రామాని శివాజీ వర్మ, తిరుమాని శ్రీనివాస్, తిరుమాని వరలక్ష్మి శ్రీనివాస్, ఒడుగు ముత్యాలరావు, సైదు శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, కేతా నాగబాబు, బోను జ్యోత్స్నాదేవి, కోటేశ్వరరావు, కోడి వరలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు తిరుమాని తులసిరావు, బొమ్మిడి పండురాజు, తిరుమాని ధనుంజయరాజు పాల్గొన్నారు.

## వికలాంగులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పాలకొల్లు శ్రీరామ్‌పేటలో ఆర్‌వి.రాజు మున్సిపల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి ఉషాలక్ష్మీకుమారి పాల్గొని మాట్లాడారు. వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూ మనందరికీ స్ఫూర్తిని ఇస్తున్న వికలాంగులకు మనం కూడా చేయూతనిచ్చి వారిని గౌరవించి అభిమానించాలన్నారు. మనతోపాటు వారికి కూడా జీవించే హక్కు ఉందని, వారిని ఎవరూ కూడా అవహేళన చేయరాదని చెప్పారు. అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చన్నారు. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జివి.సుబ్బారావు, కార్యదర్శి ప్రభాకర్, న్యాయవాది శ్రీనాథ్, పాలకొల్లు ఎంఇఒ ఎవిఎన్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

**మొగల్తూరు :** మొగల్తూరు పంచాయతీ పరిధిలోని కుక్కలవారితోటలోని భవిత సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్యాణి, లింగేశ్వరావు, శ్రీను, సిఆర్‌పి ఆనంద్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఇంగ్లీష్ పరిజ్ఞానం అవసరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థుల ఉన్నతికి అంతర్జాతీయ ఇంగ్లీష్ పరిజ్ఞానం ఎంతో ముఖ్యమైందని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు అన్నారు. కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఫారెన్ లాంగ్వేజెస్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ నూతన విభాగాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇటీవల అత్యంత ఆధునికంగా క్యాంటీన్‌ను తీర్చిదిద్ది విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తరగతులకు ఇబ్బంది లేకుండా నూతన క్రీడా ప్రాంగణాన్ని కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ఐడియా ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె.నిశాంత్‌వర్మ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, భాషా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ ఇటీవల కళాశాల పరిశీలనకు వచ్చిన అంతర్జాతీయ నిపుణులు శాస్త్రవేత్తలు ఐడియా ల్యాబ్ పరిశీలించి ప్రశంసించారని పేర్కొన్నారు. అనంతరం ఐడియా ల్యాబ్‌ను, క్రీడా ప్రాంగణాన్ని సాగి ప్రసాదరాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్యప్రతివర్మ, ఫారిన్ లాంగ్వేజెస్ ఇన్‌ఛార్జి డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి పాల్గొన్నారు.

## భూ రక్షణకే భూ హక్కు పత్రాలు : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం



భూహక్కు పత్రాలు అందిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి

భూమికి సంబంధించిన దస్తావేజు పట్ల విశ్వసనీయత కోల్పోతున్న ప్రస్తుత తరుణంలో వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న భూహక్కు భూ రక్షణ పథకం పత్రాలు భూ యజమానుల హక్కులకు రక్షణాత్మకంగా ఉంటుందని భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ పథకానికి సంబంధించి వీరవాసరం మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేలపోగుల గ్రామంలో సంబంధిత యజమానులకు భూ హక్కుల పత్రాలను శనివారం ఎంఎల్ఎ శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వెళ్లినపుడు వారి భూములకు సంరక్షణ లేకపోవడంతో రైతుల మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయన్నారు. అనేక ప్రాంతాల్లో భూ హద్దుల వద్ద వివాదాలు ఏర్పడటంతో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతున్నాయన్నారు. ఇటువంటి వివాదాలకు శాశ్వత నివారణ ఈ భూహక్కు రక్షణ పథకం అన్నారు. నేలపోగుల గ్రామంలో పూర్వపు ఆర్ఎస్ఆర్ దాఖలా మొత్తం 578.73 ఎకరాలు కాగా ప్రస్తుత రీసర్వేలో 398 ల్యాండ్ పార్సిమ్యాప్‌లుగా(ఎల్ఎంపి) నిర్ధారించినట్లు తహాశీల్దార్ సుందరాజు తెలిపారు. ఇందులో 336 రైతుల భూములుగా, 57 ప్రభుత్వ భూములుగా నిర్ధారించినట్లు తెలిపారు. ఇందులో 260 భూహక్కుల పత్రాలను సంబంధిత యజమానులకు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పాలకొల్లు :** ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు రక్షణగా ఉండేలా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం తీసుకొచ్చిందని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. పాలకొల్లు మార్కెట్ యార్డులో లబ్ధిదారులకు జగనన్న శాశ్వత భూహక్కు పట్టాలను శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్‌ప్రకాష్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ సాల నర్సయ్య, పోడూరు ఎంపిపి సుమంగళి, పాలకొల్లు జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు, చందక సత్తిబాబు, కన్వీనర్ మైఖేల్ రాజు, పి.పెద్దిరాజు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకూ అండగా టిడిపి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉండి

ప్రతి కార్యకర్తకు టిడిపి అండగా ఉంటుందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఇటీవల కాలంలో అక్రమ అరెస్టుకు గురై 29 రోజులు జైలు శిక్ష అనుభవించి శుక్రవారం సాయంత్రం బెయిల్‌పై బయటకు వచ్చిన టిడిపి నరసాపురం పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బురిడి రవిబాబు, అర్తమూరు గ్రామానికి చెందిన కాయల ఇశ్రాయెలు, కాయల కిరణ్ కుమార్, కాయల జయరాజు, కాయల సతీష్, కాయల రామ్‌కుమార్, డేవిడ్ జాన్‌లను శనివారం ఎంఎల్ఎ రామరాజు అర్తమూరు వెళ్లి పరామర్శించి టిడిపి అండగా ఉంటుందని చెప్పారు. టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోబోమని, అధికారం ఏ పార్టీకి శాశ్వతం కాదని భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, పిన్నమరాజు శ్రీనివాస్‌రాజు, కట్టా రాంబాబు, కరిమెరక శ్రీనివాసరావు, మంతెన సాయిలచ్చిరాజు, కరిమెరక నాగరాజు, ఉంగరాల నాగేశ్వరరావు, గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, కాగిత బుజ్జి పాల్గొన్నారు.

## మహిళలు ఆత్మ స్థైర్యంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

మహిళలు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని విస్సకోడేరు ఐసిడిఎస్ సిడిపిఒ వాని విజయరత్నం అన్నారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి విజయరత్నం మాట్లాడుతూ నిత్య జీవితంలో మహిళలు తమపై జరిగే హింసను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. మహిళల రక్షణ కోసం 112, 181, 1098, 100 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి పోలీసుల రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుజాత, సరళ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బొక్కవారిపాలెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, పార్టీ భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి శనివారం ప్రారంభించి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు కిట్లను సరఫరా చేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అసమర్థ అరాచక పరిపాలనతో రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ యంత్రాంగానికి తెలియజేయడానికి ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో, వార్డుల్లో శనివారం నుంచి 45 రోజులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పాల శ్రీరామదాసు, యూనిట్ ఇన్‌ఛార్జి గూడూరి సుబ్బారావు, బూత్ ఇన్‌ఛార్జిలు గూడూరి రమేష్, వాసర్ల ప్రభాకర్, మాజీ కౌన్సిలర్లు గూడూరి రామకృష్ణ, బొక్క చంద్రమోహన్ పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్ :** మండలంలోని చింతపర్రులో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు 98 శాతం పూర్తి చేశామని జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కోడి విజయభాస్కర్, పాముల రజని, అందేకోటి వీరభద్రం, పెన్మెత్స శ్రీను వాసరాజు, సాయిరాజు. పార్టీ గ్రామ ప్రెసిడెంట్ వాస మల్లికార్జునరావు, అందే ఈశ్వరరావు, అందే కృష్ణ, అంగర గోపాలకృష్ణ, అందే కోటనాగయ్య, వీరమళ్ల శ్రీను, గూడవల్లి రామారావు పాల్గొన్నారు.

**పాలకొల్లు :** పాలకొల్లుకు చెందిన ఎస్‌సి మహిళ శివమ్మ భర్త చనిపోయి 20 నెలలైనా ఆమెకు వితంతు పింఛన్ రాకపోవడంతో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అసహనం వ్యక్తం చేశారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు పదో వార్డులో ఆయన శనివారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను నమోదు చేశారు. శివమ్మకు 20 నెలల నుంచి పింఛన్ రాకపోవడంతో రూ.60 వేలు ఆమె నష్టపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి రోజారమణి, ఆనంద్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి డిపోలో తనిఖీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపోను విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. బస్సుల పరిశుభ్రత, నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్గో, కమర్షియల్ ఆదాయం పెంచుకునేందుకు తగు సూచనలు చేసారు. ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు వి.వేణు, పి.కరీమ్‌లను అభినందించి నగదు బహుమతిని, ప్రశంసాపత్రాలను అందించారు.

## కోమటితిప్పలో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కోమటితిప్పలో సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా నిర్వాహకులు శనివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కోమటితిప్పపై కోపల్లి, జంగంపాడుపై ఎండగండి, దయ్యాలుటిప్పపై కోమటితిప్ప 2 విజయం సాధించాయాని నిర్వాహకులు తెలిపారు.